క్లుప్తంగా

పంట నష్టం నమోదు పరిశీలన



నాదెండ్ల: మిచాంగ్ తుఫాను ప్రభావంతో దెబ్బ తిన్న పంటల నష్ట అంచనా వివరాలను నరసరావుపేట మండల ఏవో వరలక్ష్మి పరిశీలించారు. మండలంలోని గణపవరం గ్రామంలో బుధవారం నాలుగు సచివాలయాల పరిధిలో సిబ్బంది ఈ నెల 8 నుంచి పంట నష్ట వివరాల నమోదు ప్రక్రియ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వరలక్ష్మి బృందం పంటల నమోదును తనిఖీ చేశారు. ఏఏ పంటలు ఎంత విస్తీర్ణంలో దెబ్బతిన్నాయో పరిశీలించారు. ఏఈవోలు నమోదు చేస్తున్న వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నష్టపోయిన రైతుల వివరాల నమోదు సక్రమంగా జరుగుతుందా లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఈవోలు శేషు ఉన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన



బొల్లాపల్లి: మండలంలోని కనుమలచెరువు, ఘటితండాలను సందర్శించి పొలంలో మిరప పంటను వినుకొండ ఉద్యాన శాఖాధికారి ఎస్కె నబీరసూల్ పరిశీలించారు. ఈ సందర్భంగా మిరప సాగు రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. అధిక వర్షాల వలన పంటను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. పొలంలో నీరు నిలువ లేకుండ చూడాలని సూచించారు. పంటను ఆశించు ఆకుమచ్చ, బూడిద తెగులు నివారణకు చేపట్టాల్సిన చర్యలు గురించి తెలిపారు. బ్యాక్టీరియా, ఆకుమచ్చ కనోఫోరా వంటి నాశించు తెగుళ్ల నివారణ పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో విద్యార్థుల ప్రతిభ



బొల్లాపల్లి: మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన మండల కేంద్రంలోని బండ్లమోటు ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ ప్రదర్శనలో జిల్లా పరిషత్ బండ్లమోటు, గుమ్మనంపాడు, వెల్లటూరు, మేళ్లవాగు, రావులాపురంతో పాటు కెజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పలురకాలు శాస్త్ర సాంకేతిక ప్రతభను కనబరిచారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఈఓ కె. పార్వతి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులలోని ప్రతిభను గుర్తించేందుకు ఈ ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులలో సృజనాత్మకత, విజ్ఞానం పెంపొందించేందుకు సైన్సు ప్రదర్శనలు మరిన్ని నిర్వహించాలని సూచించారు. ఈ ప్రదర్శనలో ప్రథమ స్థానంలో గెలుపొందని విద్యార్థులు, ఉపాధ్యాయులును జిల్లాస్థాయికి ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.అపర్ణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలి



రాజుపాలెం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని లోతట్టు ప్రాంతాలలో మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని జిల్లా శాఖాధికారి రవీంద్ర రత్నాకర్ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మంగళవారం ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లో జరిగే రక్త పరీక్షలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామాలలో పర్యటించి మురికి నీరు నిల్వ ఉన్న తొట్లెలను, గుంటలను పరిశీలించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురికి నీరు నిల్వ ఉండడం వలన దోమలు వ్యాప్తిచెంది మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు వ్యాధులు సంభవిస్తాయని, ప్రతీ ఒక్కరు దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఆయన వెంట హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, హెల్త్ అసిస్టెంట్ హుస్సేన్, భరత్, ఏఎన్ఎంరాజ్యలక్ష్మి, ఆశాకార్యకర్తలు,పాల్గొన్నారు.

ప్రారంభమైన క్రిస్మస్ సందడి



లూథరన్ సంఘానికి చెందిన తిమ్మాపురం ప్యారీస్‌కు కొత్తరంగులు వేస్తున్న దృశ్యం



కొత్త రంగులతో కళకళలాడుతున్న కొండవీడు చర్చి

- వేడుకలకు ముస్తాబవుతున్న చర్చిలు
- అలంకరణ సామగ్రితో దుకాణాలు కళకళ
- వీధుల్లో ఆకట్టుకుంటున్న భారీ ఫ్లెక్సీలు, స్టార్స్

యడ్లపాడు: ప్రపంచ వ్యాప్తంగా ఒకే తేదీన ఒకే సమయంలో జరుపుకునే ఏకైక గొప్ప పర్వదినం క్రిస్‌మస్. లాటిన్ భాషలో 'క్రిస్' అనగా క్రీస్తు 'మాస్' అనగా 'ఆరాధన'. సత్యం, శాంతి, త్యాగం, దయ, కరుణ, ప్రేమ, నిరీక్షణ వంటి గొప్ప సందేశాలతో క్రీస్తు ఈ లోకానికి కొత్త మార్గాన్ని చూపారు. లోక రక్షకుడైన ఏసును కీర్తిస్తూ, ఆరాధిస్తూ ఆనందంగా జరుపుకునే పవిత్ర పండుగే క్రిస్మస్. డిసెంబర్ 25న జరుపుకునే ఈ పండగకు పక్షం రోజుల ముందు నుంచే సందడి మొదలైంది. పర్వదినం నెలరోజుల ముందు నుంచే అన్ని చర్చిల్లోనూ ప్రతిరోజు తెల్లవారుజామున 4.30 నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు కొనసాగుతున్నాయి.

కొత్త సొబగులతో చర్చిలు.. కాంతులీనుతున్న తారలు

చర్చిల్లో క్రిస్మస్ సెలబ్రేషన్స్ గ్రాండ్‌గా కొనసాగించేందుకు క్రైస్తవులు సన్నద్ధ మవుతున్నారు. ఊరువాడ పట్టణాల్లోని మందిరాలు కొత్తరంగులతో కాంతులీనుతున్నాయి. పశువుల పాకల ఏర్పాటుకు సన్నాహాలు మొదలయ్యాయి. చర్చి ఆవరణం లోపలి భాగంలో ప్రత్యేక డెకరేషన్ కోసం నిర్వాహకులు భారీగా ఖర్చు చేస్తున్నారు. వీధి కూడళ్లలో.. నివాసాలపై విద్యుత్ స్టార్లు వెలిశాయి. క్రిస్మస్ పర్వదినాన్ని స్వాగతిస్తూ అందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ వాడవాడలా పెద్ద ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. బాదం, పిస్తా, జీడీపప్పు, కిస్‌మిస్, చెర్రీస్, వైన్, రమ్, జిన్, విస్కీల మిశ్రమంతో 50 రోజుల ముందే నానబెట్టి, క్రిస్మస్ ముందురోజు వాటితో కేక్ తయారు చేసే కేక్‌మిక్సింగ్ ప్రక్రియ నవంబర్ మాసంలోనే గ్రాండ్ హోటల్స్ యాజమాన్యం చేపట్టారు.

ప్రారంభమైన వేడుకలు...

క్రిస్మస్ సంబరాల్లో భాగంగా జిల్లాలో ఈనెల మొదటి వారం నుంచి జిల్లాలో పలు కార్యక్రమాలు మొదలయ్యాయి. సెమీ క్రిస్మస్, యూత్, తల్లుల క్రిస్మస్ వేడుకలు, క్యాండిల్ సర్వీస్ వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే శిక్షణ పొందిన సండే స్కూల్ విద్యార్థులు క్రీస్తు జన్మ



సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న దృశ్యం

వృత్తాంతాన్ని తెలిపే నాటికలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆరంభమయ్యాయి.

పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక కూడికలు, కేక్‌కటింగ్, ప్రేమవిందు భోజనాలు చేస్తున్నారు. పేదలకు దుస్తులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఇళ్లల్లోనూ, వ్యాపార సంస్థల వద్ద విద్యుత్ స్టార్స్, క్రిస్మస్ ట్రీ, క్రిస్మస్ తాత పోస్టర్లు, గ్రీటింగ్స్, క్రిస్మస్ గంటలు కొవ్వొత్తుల వెలుగులు ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేస్తున్నారు. చర్చల్లో క్రిస్మస్ ప్రత్యేక గీతాలను ఆలపించడం తోపాటు బాణాసంచాతో సందడి చేస్తున్నారు. క్రైస్తవ సంఘాలు, యువకులు క్రికెట్, వివిధ క్రీడా పోటీలు, క్రైస్తవ గీతాల పోటీలను నిర్వహిస్తున్నారు.

రెండు గ్రామాల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం

- ఉన్నవ, మర్రిపాలెం గ్రామాల్లో బోర్లు, మోటార్లు ఏర్పాటు
- రూ.9 లక్షల మండల నిధులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



ఉన్నవలో బోరు పనుల పరిశీలనకు వచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు

యడ్లపాడు: రానున్న వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికలతో తాగునీటి పనులను నిర్వహిస్తున్నారు. మండలంలోని ఉన్నవ, మర్రిపాలెం గ్రామాల పరిధిలో మండల పరిషత్ నిధుల నుంచి 8 బోర్లు, వాటిలో రెండు బోర్లకు విద్యుత్ మోటర్లను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు రూ.9 లక్షల అంచనా వ్యయంతో ఉన్నవలోని గల్లా వారి వీధి, బ్రహ్మంగారి గుడి, సూర్యనగర్ కాలనీ, ఉదయపురి కాలనీ, క్రిష్టయపాలెం, మర్రిపాలెం పరిధిలో కల్పన క్రషర్ సమీపంలో బోర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉన్నవలోని సీతారామపురం, నాయుళ్ల బజారు మినహా మిగిలిన అన్ని చోట్ల బోర్లు వేయడం పూర్తయింది. ఆయా పనులను మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పిడతల దయాసాగర్, గుర్తి సింగయ్య, పందుల బుల్లెబ్బాయ్, కొప్పుల శ్యామ్యేల్‌పాల్, వలేటి ఉదయ్‌కిరణ్, బింజు సాంబశివరావు, ప్రత్తిపాటి వేణు పరిశీలించారు.

ఆరోగ్య శ్రీ నూతన కార్డుల పంపిణీ



మూగచింతలపాలెంలో నూతన ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న అధికారులు

బొల్లాపల్లి: మండలంలోని మూగచింతలపాలెం సచివాలయం వద్ద డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ నూతన కార్డుల పంపిణీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని సచివాలయ పరిధిలో మంజూరైన ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేశారు. సచివాలయం పరిధిలో 832 కార్డులు మంజూరయ్యాయి. అనంతరం వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.కృష్ణానాయక్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌కె జిలానీబాషా మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఎఎన్ఎం, ఆశ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. కార్డుల పంపిణీతో పాటు లబ్ధిదారుడికి ఈకేవైసీ తప్పనిసరన్నారు. కార్డు వినియోగంలోని వస్తుందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు మేలు జరిగే విధంగా పథకంలో మరిన్ని మార్పులు తెచ్చారని, గతంలో ఐదు లక్షల నుంచి ప్రస్తుతం రూ.25 లక్షలు వరకు ఆరోగ్య శ్రీ ద్వారా లబ్ధి చేకూరుతుందని చెప్పారు. కాన్సర్‌తో పాటు పలు రకాలు వ్యాధులకు ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్స పొందవచ్చని, ఈ కార్డు ద్వారా పేదలు ఓపీ వైద్య సేవలు సైతం పొందే అవకాశం ఉందని, లబ్ధిదారుడు సద్వినియోగపరచుకోవాలని తెలిపారు. 2285 ప్రైవేటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలు వైద్యసేవలు పొందవచ్చన్నారు. ఈ వైద్యశాలలో 3257 చికిత్సలకు వైద్యం అందుతుందని వివరించారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ఆసరా ద్వారా 1519 చికిత్సలకుగాను ప్రతిరోజు రోగికి రూ.225 వంతున చెల్లించడం జరుగుతుందని, నెలకు ఐదువేల రూపాయలు ఆసరా ద్వారా ఆరోగ్య శ్రీ వైద్య సేవలు పొందని రోగికి అందుతాయని తెలిపారు. వైఎస్సార్ కార్డు ప్రతి కుటుంబంలో అవగాహన వైద్యసిబ్బంది అవగాహన కల్గించాలని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు వైద్యులు వి.సాయితేజ, వైద్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు వైఎస్సార్ సీపీ నాయకులు బొల్లా గిరిబాబు, ఎం.రాజయ్య, డి.గోవిందునాయక్, ఆర్.కృష్ణా నాయక్, బి.గురవయ్య, పి.అవినాష్ రెడ్డి, కె.బంగారయ్య, ఎం.నవసరయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

జగనన్న రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపారు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఈ రాష్ట్రానికి మరోసారి ముఖ్యమంత్రి కావల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు చెప్పారు. పట్టణంలోని 29వ వార్డు పరిధిలో ఉన్న సుభానినగర్ వార్డు సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మల్లెల రాజేష్ నాయుడు మాట్లాడుతూ ఈ రాష్ట్రానికి జగనే అవసరమని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. తాను వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పనిచేయడాన్ని ఎంతో గర్వకారణంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఏ రంగాన్ని నిర్లక్ష్యం చేయకుండా అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం పరుగులు పెట్టిస్తోందని వెల్లడించారు. ఒక్క సుభానినగర్ సచివాలయ పరిధిలో రూ. 17.70 కోట్ల సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని వెల్లడించారు. అదే విధంగా నియోజకవర్గ వ్యాప్తంగా వందలాది కోట్ల అభివృద్ధి, సంక్షేమం చేకూరాయని పేర్కొన్నారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే పాలన తెచ్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. రెండు నెలల్లో పట్టణంలోని అన్ని వార్డులలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మీ అందరి ఆశీర్వాదం కావాలని... రానున్న ఎన్నికల్లో గతం కన్నా మెరుగైన మెజార్టీతో వైఎస్సార్ సీపీకి విజయం అందించాలని కోరారు. ఈ సందర్భంగా సంక్షేమ క్యాలెండర్‌ను, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, వార్డు కౌన్సిలర్ షేక్ యూసుఫ్‌ఆలి, నాయకులు తులం సుధాకర్, బేరింగ్ మౌలాలి, కొచ్చెర్ల కిషోర్, శివమణి దరియావలి తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీపీటీవో

నరసరావుపేట: స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపో ఆవరణలోని ప్రజారవాణా కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 3గంటల నుంచి 4 గంటలవరకు డయల్ యువర్ డీపీటీవో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీపీటీవో ఎస్.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణీకుల సమస్యల పరిష్కారానికి సూచనలు, సలహాలు స్వీకరించటం జరుగుతుందన్నారు. దీనికోసం 99592 25664 సంప్రదించాలని కోరారు.

పాఠశాలలకు 255 ట్యాబ్‌ల పంపిణీ

శావల్యాపురం: మండలంలోని ఐదు పాఠశాలల్లో 255 మందికి విద్యార్థులకు సంబంధించిన ట్యాబ్‌లను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రమైన శావల్యాపురం 80, వేల్పూరు 49, కారుమంచి 53, పొట్లూరు, 39, మతుకుమల్లి 34, మందికి ట్యాబ్‌లు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది లింగా లక్ష్మీహరి, రావూరి శివప్రసాద్, ఎలికా శ్రీనివాసరావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్



గ్యాస్ కనెక్షన్ అందిస్తున్న అధికారులు, నాయకులు

నాదెండ్ల: ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ చెప్పారు. మండలంలోని ఎండుగుంపాలెం, ఇర్లపాడు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయా గ్రామ సర్పంచ్‌లు గోరంట్ల కోటేశ్వరరావు, మంగు రమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాలపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. పథకాలను అర్హులైన లబ్ధిదారుల దరి చేర్చేందుకు స్థానిక అధికారులు కృషి చేయాలన్నారు. అర్హులైన గృహిణులకు ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్‌లను అందించారు. వివిధ శాఖల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాద్‌నాయక్, ఎంఈవో ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు ప్రశాంతి, ఎస్.మాధవి, బీజేపీ జిల్లా కార్యదర్శి కస్తూరి వెంకటేశ్వర్లు, గణపవరం సొసైటీ చైర్మన్ మంగు ఏడుకొండలు, నాయకులు పర్వతనేని బ్రహ్మయ్య, సూరె బుచ్చయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉషారాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యదశలోనే సృజనాత్మకత పెంపొందించుకోండి

విద్యార్థులకు డిప్యూటీ డీఈఓ కె.వేణుగోపాల్ సూచన



సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న వేణుగోపాల్

నరసరావుపేట రూరల్: విద్యార్థులు బాల్య దశ నుంచి వినూత్నమైన ఆలోచనలతో సృజనాత్మకతతో సమస్యలకు పరిష్కారం కనుగొనాలని డిప్యూటీ డీఈఓ కె.వేణుగోపాల్ తెలిపారు. లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో మండల సైన్స్ ఫెయిర్ మంగళవారం నిర్వహించారు. సైన్స్ ఫెయిర్‌ను డిప్యూటీ డీఈఓ ప్రారంభించి విద్యార్థులు రూపొందించిన నమూనాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాలలో మండలస్థాయి సైన్స్ ఫెయిర్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలస్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఈనెల 22వ తేదీ పట్టణంలోని హర్ష్ జూనియర్ కళాశాలలో నిర్వహించే జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ మధు కుమార్, మండల విద్యాశాఖ అధికారి ఏసుబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి, సైన్స్ ఉపాధ్యాయులు చింతా శ్రీనివాసరెడ్డి, అనిత, రఘురాం, బి.శ్రీనివాసరావు, వీరాస్వామి పాల్గొన్నారు.

పేటలో సెమీ క్రిస్మస్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు

- 21న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వేడుకలు
- పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు

చిలకలూరిపేట: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఈ నెల 21న పట్టణంలోని పాత పశువుల సంత పక్కన ఉన్న గోల్కొండ గార్డెన్స్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు జరుగనున్నాయి. ఈ వేడుకలకు సంబంధించి పోస్టర్లు, కరపత్రాలను వైఎస్సార్ సీపీ కృష్ణా, ఎన్‌టీఆర్, గుంటూరు జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మంగళవారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. క్రిస్మస్ విశిష్టతను తెలిపేలా భారీ ఎత్తున కార్యక్రమం చేపట్టిన మల్లెల రాజేష్‌నాయుడును అభినందించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెడవల్లి చినబాబు, ఏఎంఎం సుభాని, బేరింగ్ మౌలాలి, తులం సుధాకర్, తాళ్లూరి ప్రభుదాస్, షేక్ రహంతుల్లా, మాదం శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న విజయలక్ష్మి, రాజ్యలక్ష్మి, డాక్టర్ గట్టు రంగారావు

ఇతరులపై ప్రేమ చూపడమే క్రీస్తు చూపిన మార్గం

యడ్లపాడు: పేదవారిని ఆదరించి వారిపై ప్రేమ, కరుణ, దయ కలిగి ఉండటమే క్రీస్తు చూపిన మార్గమని ఇన్నర్ వీల్ క్లబ్ 315 జిల్లా చైర్మన్ కె.విజయలక్ష్మి చెప్పారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో సెమిక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట బున్నీనగర్‌లో మంజూలా నర్సింగ్‌హోం డాక్టర్ గట్టు రంగారావు అధ్యక్షతన జరిగింది. ముందుగా చర్చి పాస్టర్ కృష్ణ క్రిస్మస్ సందేశాన్ని వివరించి ప్రార్థన చేశారు. అనంతరం దాతలు గుంటి వినిత జ్ఞాపకార్థం భర్త నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు, అలాగే బిట్రా నాగమల్లేశ్వరరావు ఆర్థిక సహకారంతో లెప్రసీ వ్యాధిగ్రస్తులు రూ.70 వేల 150 మందికి నూతన వస్త్రాలు, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం వారికి ప్రేమ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్లబ్ పాస్ట్‌ప్రెసిడెంట్ పాస్ట్ ప్రెసిడెంట్ రాజ్యలక్ష్మి, మౌలాబుడే, బున్నీనగర్ పెద్దలు పాల్గొన్నారు.



చిరుమామిళ్లలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు, స్థానిక మహిళలు

చిరుమామిళ్లలో సెమీక్రిస్మస్

నాదెండ్ల: చిరుమామిళ్ళ ఎస్సీ కాలనీలోని ఎల్ఈఎఫ్ చర్చిలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చి ఫాస్టర్ వాసిమళ్ళ యాకోబు ముందుగా ప్రత్యేక ప్రార్థనలు అనంతరం క్రీస్తు జననం, క్రిస్మస్ విశిష్టతను వివరించారు. సండే స్కూలు చిన్నారులు చేసిన ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు స్థానికులను ఆకట్టుకున్నాయి. ముందుగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులకు బహుమతులు అందించారు. క్రిస్మస్ ట్రీ, స్టార్స్ ఏర్పాటు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జాన్సన్, సండే స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.

సైన్స్ ప్రదర్శనలతో విజ్ఞానం

- ఎంఈవో -2 అరుణకుమారి
- యడ్లపాడులో మండలస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన
- ప్రదర్శన పోటీల్లో ఏడు హైస్కూల్స్ విద్యార్థులు
- పలు నమూనాల ప్రదర్శనలు




విద్యార్థుల నమూనాలను తిలకిస్తున్న దృశ్యం

యడ్లపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు.. సమాజంలో జరిగే పరిణామాలపై రూపొందించిన ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. మండల ఎంఈవో-2 అరుణకుమారి, యడ్లపాడు జెడ్పీహైస్కూల్ హెచ్ఎం జి.విజయభారతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలం పరిధిలోని ఏడు హైస్కూల్స్‌కు చెందిన విద్యార్థులు హాజరై ఆరోగ్యం, సంక్షేమం, పర్యావరణం, సాగునీరు ఇలా ఎంచుకున్న వాటిని పరిష్కరించేలా విద్యార్థులు స్వయంగా తయారు చేసిన నమూనాలను ప్రదర్శించారు. సందర్శించిన వివిధ పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఆయా ప్రాజెక్టుల గురించి విశదీకరించి వివరించారు.

ఈ ప్రదర్శన పోటీల్లో..

ఉపాధ్యాయుల విభాగంలో సొలస (జెడ్పీ) ఆర్‌వీ కృష్ణమాచారి, బృంద విభాగంలో.. కారుచోల (జెడ్పీ) విద్యార్థినులు ఎం సాహితీ, సయ్యద్ ఫర్హాన, వ్యక్తిగత విభాగంలో.. లింగారావుపాలెం(జెడ్పీ) విద్యార్థులు జి సుశాంత్ ఉత్తమ ప్రదర్శన బహుమతులు దక్కాయి. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో అరుణ కుమారి మాట్లాడుతూ సైన్స్ ప్రదర్శనలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందన్నారు.

రాకేష్‌కు 'తెలుగు జాతీయ అకాడమీ పురస్కారం'



రాకేష్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

నరసరావుపేట: శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం బుద్దాల కన్వెన్షన్ హాలులో నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలలో తనకు తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ జాతీయ పురస్కారం అందజేశారని గుండాల రాకేష్ మంగళవారం వెల్లడించారు. మాతృ భాష, సాహిత్యం, కళ, సంస్కృతి సంప్రదాయాల అభివృద్ధికి కవిత్వం ద్వారా తాను చేస్తున్న కృషిని అభినందిస్తూ ఘనంగా సన్మానించారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కవులు, రచయితలు, ఉపాధ్యాయులు, సాహితీ వేత్తలు, ప్రముఖులు హాజరై 30 గంటల పాటు కళా ప్రదర్శనలు, కవి సమ్మేళనాలు, రంగస్థల ప్రదర్శనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారన్నారు. శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో జాతీయ సమన్వయకర్త, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి ఈ కార్యక్రమాల్ని పర్యవేక్షించారన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర హోం శాఖమాత్యులు తానేటి వనిత, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోల్ల శ్రీలక్ష్మి, ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, తాడేపల్లిగూడెం మాజీ ఎమ్మెల్యే నాని హాజరయ్యారన్నారు.

23న ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక

క్రోసూరు: మండలంలో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు జరిగిన జాతీయ ఉపాధి హామీ పనులపై ఈనెల 23న సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించబడుతుందని ఎంపీడీవో బి.మహేష్‌బాబు మంగళవారం తెలిపారు. మండలంలోని 18 గ్రామపంచాయతీల్లో జాతీయ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన రూ.4.5 కోట్లు పనులు, పంచాయతీరాజ్ పనులు రూ.3.5 కోట్లు తాలూకు సామాజిక తనిఖీలు నిర్వహించటం జరిగిందన్నారు. వాటిపై మండల స్థాయిలో స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్వామా పీడీ గంగవరపు జోసఫ్, ఏపీడీ పాత్తూరు వెంకట నారాయణ పాల్గొంటారని తెలిపారు.

జాతీయ క్విజ్ పోటీలకు ఎంపిక



నరసరావుపేట రూరల్: జాతీయస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైన మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులను జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ మంగళవారం అభినందించారు. మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఎస్‌కె అంజుమ్ గౌస్య, బి.లక్ష్మీ నాగశ్రావ్యలు నేషనల్ ఏజేడీఎస్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నిర్వహించిన క్విజ్ పోటీలలో జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ప్రథమస్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 21వ తేదీ ముంబైలో జరిగే జాతీయస్థాయి పోటీలలో విద్యార్థినులు పాల్గొంటారు. విద్యార్థినులను, గైడ్ టీచర్ పి.అనితను జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ మధుకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సులేఖ పాల్గొన్నారు.